సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
సోమవారం । 16 । అక్టోబర్ । 2023



దసరా వేడుకలు ప్రారంభం
ప్రశాంతి నిలయంలో విజయదశమి వేడుకలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. 8లో



టమాట కిలో రూ.10
కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.10 పలికింది. కనిష్టం రూ.4, సరాసరి రూ.7 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
38.6°/22.1°
జిల్లాలో ఆదివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం తగ్గింది. ఉక్కపోత పెరిగింది. ఆగ్నేయం దిశగా గాలి గంటకు 4 నుంచి 6 కిలో మీటర్ల వేగంతో వీచింది.

న్యూస్‌రీల్

ఖాద్రీశా..శరణు



మత్స్యావతారంలో ఖాద్రీశుడు

కదిరి టౌన్‌: శరన్నవరాత్రి ఉత్సవాలు జిల్లాలో కనులపండువగా సాగుతున్నాయి. ఆదివారం రాత్రి ఖాద్రీశుని ఆలయంలో స్వామివారు మత్స్యావతారంలో దర్శనమిచ్చి భక్తులను కటాక్షించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్‌ గోపాలకృష్ణ, ఈఓ వి.శ్రీనివాసరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

నేడు 'స్పందన'

పుట్టపర్తి అర్బన్‌: కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా స్థాయి 'స్పందన' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్‌ అరుణ్‌బాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించి పరిష్కరించనున్నట్లు తెలిపారు. పెనుకొండ సబ్‌ కలెక్టర్‌ కార్యాలయం, ధర్మవరం, కదిరి ఆర్డీఓ కార్యాలయాలు, మండల స్థాయిలోనూ ఉదయం 10 గంటలకు 'స్పందన' ప్రారంభమవుతుందన్నారు. వినతి పత్రాలపై ఆధార్‌, ఫోన్‌ నంబర్లు తప్పనిసరిగా పొందుపరచాలని సూచించారు.

ఎస్పీ కార్యాలయంలోనూ..
పుట్టపర్తి టౌన్‌: జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్‌ హాల్లో సోమవారం 'స్పందన' ఉంటుంది. ప్రజలు తమ సమస్యలపై ఎస్పీ మాధవరెడ్డికి ఫిర్యాదు చేసుకోవచ్చు. సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ కోరారు.

పీఏబీఆర్‌లో నిలకడగా నీటి మట్టం



కూడేరు: జలాశయంలో నిల్వ ఉన్న నీరు

కూడేరు: మండల పరిధిలోని పెన్నహోబిళం బ్యాలెన్సింగ్‌ రిజర్వాయర్‌ (పీఏబీఆర్‌ డ్యాం)లో ఇన్‌ఫ్లో, అవుట్‌ ఫ్లో ఇంచుమించు సమానంగా ఉండడంతో నీటి మట్టం నిలకడగా ఉంది. తుంగభద్ర జలాశయం నుంచి హెచ్చెల్సీ ద్వారా రోజూ 170 క్యూసెక్కుల నీరు పీఏబీఆర్‌కు చేరుతోంది. పీఏబీఆర్‌ వద్ద ఏర్పాటు చేసిన శ్రీ సత్యసాయి, అనంతపురం, శ్రీరామరెడ్డి, ఉరవకొండ తాగునీటి ప్రాజెక్టులకు నీటి సరఫరా, నీటి ఆవిరి, లీకేజీ రూపంలో కలిపి రోజుకు సుమారు 150 క్యూసెక్కులు అవుట్‌ ఫ్లో వెళ్తోంది. ఆదివారం నాటికి డ్యాంలో 2.37 టీఎంసీల నీరు ఉన్నట్లు ఇరిగేషన్‌ జేఈఈ లక్ష్మీదేవి తెలిపారు.

'సెబ్‌' దూకుడు

పుట్టపర్తి టౌన్‌: జిల్లాలో 'సెబ్‌'(స్పెషల్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ బ్యూరో) దాడులు కొనసాగుతున్నాయి. ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేరకు సెబ్‌ అధికారులు కొన్ని రోజులుగా విస్తృత దాడులు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం కూడా పలు చోట్ల తనిఖీలు నిర్వహించారు. హిందూపురం పోలీసుస్టేషన్‌ పరిధిలో పెన్నానది వద్ద 48 కర్ణాటక మద్యం పాకెట్లతో పాటు వాటిని తరలిస్తున్న ఒక వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. కదిరి మండలం ఎర్రదొడ్డి వద్ద ఒక వ్యక్తిని అరెస్టు చేసి 20 టెట్రా ప్యాకెట్లు, పెనుకొండ స్టేషన్‌ పరిధిలో ఆంజనేయస్వామి దేవాలయం వద్ద 14 టెట్రా ప్యాకెట్లు పట్టుకుని ఒక వ్యక్తిపై కేసు నమోదు చేశారు. అక్రమంగా మద్యం తరలించినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో ఎలుగుబంటి మృతి



ఎలుగు బంటి కళేబరం

కళ్యాణదుర్గం రూరల్‌: రోడ్డు ప్రమాదంలో ఎలుగుబంటి మృతి చెందింది. ఎర్రంపల్లి గేట్‌ సమీపంలోని కొండ ప్రాంతం నుంచి ఎలుగుబంట్లు నీళ్ల కోసం రోడ్డు పక్కన పొలాల్లోకి వస్తుంటాయి. అందులో భాగంగానే ఆదివారం తెల్లవారుజామున రోడ్డు దాటుతున్న ఓ ఎలుగుబంటిని గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎలుగుబంటి అక్కడికక్కడే మృతి చెందిందని అటవీశాఖ సిబ్బంది తెలిపారు. ఎలుగు బంటికి కైరేవు నర్సరీలో డీఎఫ్‌ఓ సందీప్‌ కృపాకర్‌, ఎఫ్‌ఆర్‌ఓ రామ్‌సింగ్‌, ఎఫ్‌ఎస్‌ఓ షానవాజ్‌, ఏడీఏ నాగలింగేశ్వరరెడ్డి సమక్షంలో వెటర్నరీ డాక్టర్‌ నాగరాజు పోస్టుమార్టం నిర్వహించారు.

పల్లెకు ఆరోగ్య భరోసా

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 24 గంటలూ సేవలు

- మూడు షిఫ్టుల్లో పనిచేస్తున్న వైద్య సిబ్బంది
- అర్ధరాత్రి వెళ్లినా అందుతున్న వైద్యం
- ప్రభుత్వ చర్యలపై హర్షం వ్యక్తం చేస్తున్న జనం



రొద్దం పీహెచ్‌సీ

- కొత్తచెరువుకు చెందిన రాజారెడ్డి (38)కి ఈనెల 13వ తేదీన రాత్రివేళ ఛాతినొప్పి వచ్చింది. వెంటనే అతను స్థానిక పీహెచ్‌సీకి వెళ్లగా వైద్యులు పరీక్షించి ఇంజెక్షన్‌ వేశారు. మందులు ఇచ్చి పంపించారు. తక్షణమే ఉపశమనం పొందినట్లు రాజారెడ్డి ఆనందం వ్యక్తం చేశాడు.
- గుడిబండకు చెందిన రమణమ్మ (43) ఈనెల 9వ తేదీ రాత్రి 10 గంటల సమయంలో ఉన్నఫలంగా అస్వస్థతకు గురి కావడంతో కుటుంబీకులు స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ సిబ్బంది ఆమెకు చికిత్స చేసి మందులు ఇచ్చి పంపించారు.
- పెద్దకోడిపల్లికి చెందిన శ్రీనివాసులు (54)కు ఈనెల 1వ తేదీన తీవ్ర జ్వరం రావడంతో రొద్దం పీహెచ్‌సీకి రాత్రి 9.30 గంటల సమయం వెళ్లారు. సిబ్బంది ఆరోగ్య పరీక్షలు చేసి మాత్రలు ఇచ్చి పంపారు.

...ఇలా ఏ సమయంలో వెళ్లినా పీహెచ్‌సీల్లో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నారు. గ్రామీణులు ఏ చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా పీహెచ్‌సీల బాట పడుతుండగా, ఆర్‌ఎంపీల క్లినిక్‌లు, ప్రైవేటు ఆస్పత్రులు వెలవెలబోతున్నాయి.

సాక్షి, పుట్టపర్తి

అర్ధరాత్రో, అపరాత్రో పాము కరిచినా, కుక్క కాటు వేసినా, గర్భిణికి పురిటినొప్పులు వచ్చినా, వృద్ధుడికి ఛాతిలో నొప్పి వచ్చినా వారికి చికిత్స చేయించేందుకు పల్లెవాసులు పడే కష్టాలు అన్నీఇన్నీ కావు. సకాలంలో పట్నానికి తీసుకెళ్లి ఆస్పత్రిలో చేర్చేంత వరకూ కుటుంబీకులు నిమిషానికోసారైనా దేవుడిని మొక్కుకుంటూ ఉంటారు. కానీ జిల్లాలో ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గ్రామీణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని తగు చర్యలు చేపట్టారు. ఫలితంగా ఏ సమయంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి వెళ్లినా వైద్య సేవలు అందించేందుకు వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటున్నారు. అలాగే అవసరమైన మందులూ ఉచితంగా అందిస్తున్నారు.

పల్లె ముంగిటకే వైద్యసేవలు



పగటి వేళ వైద్యులే పల్లెల్లో రోగి ఇంటికి వెళ్లి సేవలు అందించేలా సీఎం జగన్‌ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. మరోవైపు పీహెచ్‌సీలకు వచ్చే రోగులకు నిరంతరం సేవలు అందించేలా సిబ్బందిని నియమించి ఉపశమనం కల్పించింది. ఇప్పటికే ప్రభుత్వం పీహెచ్‌సీల పరిధిలోని గ్రామాల్లో ఫ్యామిలీ ఫిజీషియన్‌ కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహిస్తోంది. ఇటీవల 'జగనన్న ఆరోగ్య సురక్ష' ద్వారా మరిన్ని వైద్య సేవలు అందుతున్నాయి. ప్రతి పల్లెలో ఇంటింటికీ వైద్య సేవలు అందుతున్నాయి. తాజాగా గ్రామాల్లోని పీహెచ్‌సీల్లోనూ 24 గంటలూ వైద్య సేవలు అందుతుండటంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి.

పూర్తిస్థాయి సిబ్బందితో సేవలు

ప్రజలకు నిరంతర వైద్య సేవలు అందించేందుకు సీఎం జగన్‌ సర్కార్‌ కృషి చేస్తోంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నిరంతర వైద్య సేవలు అందుబాటులోకి తీసుకొచ్చింది. జిల్లా వ్యాప్తంగా 47 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలుండగా, సెప్టెంబరు 1వ తేదీ నుంచి 45 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నిరంతర వైద్య సేలు రోగులకు అందుతున్నాయి. ఒక్కో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 14 మంది సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకున్నారు. ఒక వైద్యుడు ఆస్పత్రికి వచ్చే రోగులకు చికిత్స చేయనుండగా.. మరో డాక్టర్‌ గ్రామాలకు వెళ్లి విలేజ్‌ హెల్త్‌ క్లినిక్‌లకు వచ్చే రోగులకు వైద్యం చేస్తున్నాడు. తలుపు తడితే వైద్యం అందించేలా సర్కారు కృషి చేస్తోంది.

అదనపు పీహెచ్‌సీలు మంజూరు

జనాభా ప్రాతిపదికన ప్రభుత్వం పీహెచ్‌సీలను అందుబాటులోకి తెస్తోంది. గోరంట్ల, పెనుకొండకు అదనంగా పీహెచ్‌సీలను మంజూరు చేసింది. ఆయా ప్రాంతాల్లో పీహెచ్‌సీల ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. ఇక జిల్లాలోని 47 పీహెచ్‌సీల్లో ప్రస్తుతం 45 పీహెచ్‌సీల్లో 24 గంటల వైద్యం అందుతోంది.



కొత్తచెరువు పీహెచ్‌సీలో మహిళకు వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది (ఫైల్‌)

ఒక్కో పీహెచ్‌సీలో సిబ్బంది ఇలా

వైద్యులు	2	ఎంపీహెచ్‌ఎస్‌ మేల్‌	1
స్టాఫ్‌ నర్సులు	3	జూనియర్‌ అసిస్టెంట్‌/ సీనియర్‌ అసిస్టెంట్‌	1
ఫార్మసిస్టు	1	ఎంపీహెచ్‌ఎస్‌ ఫిమేల్‌	1
ల్యాబ్‌ టెక్నీషియన్‌	1	సీహెచ్‌ఓ	1
ఎంఎన్‌ఓ లేదా ఎఫ్‌ఎన్‌ఏ	1	హెల్త్‌ ఎడ్యుకేటర్‌	1
మేల్‌, ఫిమేల్‌ అసిస్టెంట్లు	1		



పీహెచ్‌సీల్లో విధులు ఇలా..

ప్రతి పీహెచ్‌సీలోనూ మూడు షిఫ్టుల్లో సిబ్బంది విధులు నిర్వర్తిస్తుంటారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 8 గంటల వరకు, రాత్రి 8 నుంచి ఉదయం 8 గంటల వరకు మూడు షిఫ్టుల్లో సేవలు అందుతున్నాయి. అత్యవసర కేసులు వస్తే కాల్‌ డ్యూటీ మీద డాక్టర్లు విధులకు రావాల్సి ఉంటుంది.

రాత్రి వేళల్లోనూ పీహెచ్‌సీలకే వస్తున్నారు



విధుల్లో భాగంగా మూడు షిఫ్టుల్లో పని చేస్తున్నాం. రాత్రి వేళల్లోనూ పీహెచ్‌సీకి వచ్చే వారి సంఖ్య పెరుగుతోంది. ఏ సమయంలో వచ్చినా చికిత్స చేస్తున్నాం. రోగులకు ఎలాంటి ఇబ్బంది రానివ్వం. రాత్రి పూట విధుల్లో ఎలాంటి భయం లేదు. పోలీసులు కూడా గస్తీ నిర్వహిస్తున్నారు.

– రజియాబేగం, స్టాఫ్‌ నర్సు, రొద్దం పీహెచ్‌సీ

24 గంటలూ వైద్యసేవలు



జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలన్నీ 24 గంటలూ సేవలు అందిస్తున్నాయి. ఇద్దరు డాక్టర్లు, ముగ్గురు స్టాఫ్‌ నర్సులు, మరో 9 మంది ఇతర సిబ్బంది ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. రోజుకు మూడు షిఫ్టుల పద్ధతిలో సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. అన్ని పీహెచ్‌సీల్లో సిబ్బందిని సర్దుబాటు చేశాం. – ఎస్‌వీ కృష్ణారెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

చేనేత కార్మికులతో నేడు సమావేశం



కలెక్టర్‌ అరుణ్‌బాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న హరిప్రీత్‌ సింగ్‌

పుట్టపర్తి అర్బన్‌/ధర్మవరం: ధర్మవరం మున్సిపల్‌ కార్యాలయంలో సోమవారం ఉదయం 11 గంటలకు 'ఒన్‌ డిస్ట్రిక్ట్‌ ఒన్‌ ప్రొడక్ట్‌' పథకంపై సమీక్ష నిర్వహిస్తున్నట్లు జిల్లా హ్యాండ్‌ లూమ్స్‌, టెక్స్‌టైల్‌ ఏడీ రమేష్‌ బాబు ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఇన్వెస్ట్‌ ఇండియా సంస్థ ప్రతినిధి హరిప్రీత్‌సింగ్‌ చేనేత కార్మికులతో సమావేశమవుతారన్నారు. చేనేత పట్టు చీరల ఉత్పత్తి కేంద్రాలు, డైయింగ్‌ యూనిట్లను పరిశీలిస్తారన్నారు. మధ్యాహ్నం సోమందేపల్లి వీవర్స్‌ కాలనీని సందర్శిస్తారని తెలిపారు. దేశంలోని అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో పట్టు చీరల ఉత్పత్తికి పేరుగాంచిన ధర్మవరాన్ని కేంద్ర ప్రభుత్వం 'ఒన్‌ డిస్ట్రిక్ట్‌ ఒన్‌ ప్రొడక్ట్‌'కు ఎంపిక చేసినట్లు వివరించారు. ఇందులో భాగంగా అవార్డు అందజేస్తారని, ఈ విషయంపై చర్చించేందుకు సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన హరిప్రీత్‌సింగ్‌

జిల్లాకు విచ్చేసిన ఇన్వెస్ట్‌ ఇండియా సంస్థ ప్రతినిధి హరిప్రీత్‌ సింగ్‌ ఆదివారం కలెక్టర్‌ అరుణ్‌బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. పుట్టపర్తిలోని కలెక్టర్‌ బంగ్లాలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ప్రశాంతినిలయం చేరుకున్న ఆయనకు పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ, జౌళి, చేనేత శాఖ జిల్లా అధికారి రమేష్‌ బాబు స్వాగతం పలికారు.

వీఆర్‌ఏల సంఘం జిల్లా నూతన కమిటీ ఎంపిక

పుట్టపర్తి అర్బన్‌: వీఆర్‌ఏల సంఘం జిల్లా నూతన కమిటీని ఎంపిక చేశారు. ఆదివారం ఏపీజేఏసీ జిల్లా అధ్యక్షుడు మైనుద్దీన్‌ ఆధ్వర్యంలో పుట్టపర్తి తహసీల్దార్‌ కార్యాలయం వద్ద కార్యక్రమం నిర్వహించారు. కమిటీ జిల్లా అధ్యక్షుడిగా పూజారి చంద్రమోహన్‌, ప్రధాన కార్యదర్శిగా గంగాధర్‌, ట్రెజరర్‌గా నరసింహులు, వైస్‌ ప్రెసిడెంట్లుగా మహేష్‌, నాగేంద్ర, నాగప్పను ఎంపిక చేశారు. అలాగే, జాయింట్‌ సెక్రటరీలుగా శ్రీనివాసులు, సుదర్శన్‌రెడ్డి, రంగనాథ, డైరెక్టర్లుగా వెంకటలక్ష్మి, గిడ్డ నాగప్ప, ఎన్‌.నాగప్ప, రమేష్‌, శ్రీకాంత్‌, కదిరప్ప, ఈశ్వరమ్మ, కార్యవర్గ సభ్యులుగా వెంకటరమణ, శ్రీనివాసులు, గంగాద్రి ఎంపికయ్యారు. కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మయ్య, రాష్ట్ర కార్యదర్శి సీతారాముడు, ట్రెజరర్‌ సత్యనారాయణకు జిల్లా కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఒత్తిళ్లు తట్టుకోలేకపోతున్నాం



అనంతపురం రూరల్‌ సబ్‌రిజిస్ట్రార్‌ కార్యాలయం

- వాట్సాప్‌ కాల్స్‌ ద్వారా బెదిరింపులు
- డబ్బు కోసం ప్రైవేట్‌ వ్యక్తుల డిమాండ్‌
- సామాజిక, కుల సంఘాల పేరుతో ఇబ్బంది
- అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల ఎస్పీలకు సబ్‌రిజిస్ట్రార్ల లేఖ

సాక్షి ప్రతినిధి, అనంతపురం: 'కొంతమంది సామాజిక సంఘాలు, కుల సంఘాలు, స్థానిక మీడియా సంస్థల పేరుతో మమ్మల్ని రోజూ వేధిస్తున్నారు. డబ్బు ఇవ్వాలంటూ బ్లాక్‌మెయిల్‌ చేస్తున్నారు. ఇప్పటికే మా ఉద్యోగి ఒకరు ఒత్తిళ్లు తట్టుకోలేక మృతి చెందారు. దీనిపై కఠినమైన చర్యలు తీసుకుంటే తప్ప మేము విధులు నిర్వర్తించలేం' అంటూ అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు చెందిన సబ్‌రిజిస్ట్రార్లు ఇరు జిల్లాల ఎస్పీలకు లేఖలు అందజేశారు. జిల్లా రిజిస్ట్రార్‌ సైతం లేఖలో సంతకం చేశారు. ఈ లేఖ జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. సబ్‌రిజిస్ట్రార్లు మొత్తం లేఖలో సంతకాలు చేశారు. ఇలా డిపార్ట్‌మెంట్‌ ఉద్యోగులు మొత్తం ఎస్పీకి లేఖ ఇవ్వడం ఇదే మొదటి సారి అనే చర్చ జరుగుతోంది.

లేఖలో ఏముందంటే...

'కొద్ది నెలల నుంచి సబ్‌రిజిస్ట్రార్‌ల కార్యాలయాలకు కులసంఘాలు, సామాజిక కార్యకర్తలు, స్థానిక మీడియా ప్రతినిధుల పేరుతో వచ్చి మా విధులకు ఆటంకం కలిగిస్తున్నారు. డబ్బులు డిమాండ్‌ చేస్తున్నారు. ఇవ్వకపోతే ఆర్టీఐ యాక్ట్‌ద్వారా అప్లికేషన్లు పెడుతున్నారు. అయినా స్పందించకపోతే వాట్సాప్‌ గ్రూపుల్లో మా నంబర్లు యాడ్‌ చేసి దారుణమైన వ్యాఖ్యలు చేస్తున్నారు. ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేస్తామంటారు. విజయవాడ ఉన్నతాధికారులకు నిరాధార ఆరోపణలతో కూడిన మెసేజ్‌లు పెడుతున్నారు. బెదిరిస్తున్న వారి నంబర్లు బ్లాక్‌ చేస్తే వేరే నంబర్ల నుంచి వాట్సాప్‌కాల్‌ చేసి తీవ్ర పదజాలంతో దూషిస్తున్నారు' అంటూ లేఖలో రాశారు.

లేఖలో కొంతమంది పేర్లు కూడా..

సబ్‌రిజిస్ట్రార్‌లు రాసిన లేఖలో కొంతమంది పేర్లు పొందుపరిచారు. లేఖలో పేర్కొన్న వారు తరచూ సబ్‌రిజిస్ట్రార్‌ కార్యాలయాలకు వచ్చి ఇబ్బంది పెట్టడం, విధులకు ఆటంకం కలిగించడం, వాట్సాప్‌ గ్రూపుల్లో దారుణంగా వ్యాఖ్యలు చేసినట్టు వెల్లడించారు. ఇటీవల జిల్లా రిజిస్ట్రార్‌ నాగభూషణం మృతి చెందారని, ఇలాంటి వారి ఒత్తిళ్లే అందుకు కారణమని ఆరోపించారు. ఇలా చాలామంది కార్యాలయాలకు వచ్చి భయాందోళనకు గురిచేస్తూ తమను పనులు చేయనివ్వడం లేదని పేర్కొన్నారు.

ఎంతటివారైనా ఉపేక్షించం

బెదిరింపు కాల్స్‌ వస్తే స్థానిక పోలీసుస్టేషన్‌లో సదరు వ్యక్తిపై ఫిర్యాదు చేయాలని సబ్‌ రిజిస్ట్రార్లకు సూచించాం. ఎవరికి బెదిరింపు కాల్స్‌ వచ్చాయో.. ఆయా మొబైల్‌ నంబర్లు, వ్యక్తుల పేర్లను ఫిర్యాదులో తెలియజేయాలని సూచించాం. బెదిరింపులకు పాల్పడితే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదు. కేసులు నమోదు చేస్తాం.

– ఎస్‌వీ మాధవ్‌రెడ్డి, ఎస్పీ

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్‌

- రూ.10 లక్షల విలువైన 22 వాహనాల స్వాధీనం
- 8 మంది ముఠా సభ్యుల్లో ఐదుగురి పట్టివేత
- ముగ్గురు ప్రధాన నిందితుల కోసం గాలింపు



నిందితులను అరెస్టు చూపుతున్న పోలీసులు

మదనపల్లె (అన్నమయ్య జిల్లా): రోడ్డు పక్కన, ఇళ్ల ఎదుట నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనాలను అపహరించుకెళ్లే అంతర్రాష్ట్ర ముఠా సభ్యులను అరెస్ట్‌ చేసినట్లు డీఎస్పీ కేశప్ప, వన్‌టౌన్‌ సీఐ మహబూబ్‌ బాషా తెలిపారు. స్థానిక వన్‌టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌లో కేసు వివరాలను వారు వెల్లడించారు. పట్టణంలోని బెంగళూరు రోడ్డులో వన్‌టౌన్‌ పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా కొందరు వ్యక్తులు చూసి పరారయ్యారు. గమనించిన పోలీసులు వారిని వెంబడించి అదుపులోకి తీసుకుని విచారించడంతో తాము చేసిన చోరీల గురించి వివరించడంతో వివిధ కంపెనీలకు చెందిన 22 మోటార్‌ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో కర్ణాటకలోని కోలారు జిల్లా మాస్తి తాలూకా మాలూరుకు చెందిన కావడి శ్రీనివాస్‌, అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలం బడికాయలపల్లె జింకదాట్లపల్లెకు చెందిన జి.వరదరాజులు, మదనపల్లె టౌన్‌ బసినికొండ నివాసి షేక్‌ అజీజ్‌, శ్రీసత్యసాయి జిల్లా తనకల్లు మండలం కొక్కంటి క్రాస్‌కు చెందిన షేక్‌ మహమ్మద్‌ రసూల్‌, మొలకలచెరువు మండలం పాత మొలకలచెరువుకు చెందిన కావడి శేఖర్‌ ఉన్నారు. నిమ్మనపల్లె, మదనపల్లె వన్‌, టూ, ముదివేడు, బి.కొత్తకోట, పీలేరు పోలీస్‌ స్టేషన్లలో వీరిపై కేసులు ఉన్నట్లుగా వెల్లడైంది. పరారీలో ఉన్న ప్రధాన నిందితులు తమిళనాడుకు చెందిన అరుణాచలం, రాజేంద్ర, నరసింహులు కోసం పోలీసులు గాలిస్తున్నారు. కాగా, అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్‌లో చొరవ చూపిన సీఐ ఎస్‌.మహబూబ్‌బాషా, ఎస్‌ఐ సి.హరిహరప్రసాద్‌, కానిస్టేబుళ్లు చక్రపాణిరెడ్డి, వెంకటేశ్వర్లు, ఎస్‌బీ.జైనుద్దీన్లను డీఎస్పీ కేశప్ప అభినందించారు.


'రబీ'కి ఇబ్బంది లేదప్పా!

- 35 వేల హెక్టార్లలో పంటలు సాగు చేయొచ్చని అంచనా

పుట్టపర్తి అర్బన్‌: రబీ సీజన్‌ ప్రారంభమైంది. పంటల సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. గత ఏడాది 'రబీ'లో 28 వేల హెక్టార్లలో పంటలు సాగులోకి రాగా, ప్రస్తుత సీజన్‌లో 35 వేల హెక్టార్లలో పంటలు సాగు చేయవచ్చని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. వేరుశనగ 18 వేల హెక్టార్లు, వరి 3,600, పప్పుశనగ 3,150 , మొక్కజొన్న 3,150, రాగి 884, ఉలవ 620, పొద్దు తిరుగుడు 370, టమాట 1,620, ఉల్లి 200, ఇతర కూరగాయ పంటలు 1,100 హెక్టార్ల మేర సాగు చేయవచ్చని అంచనా వేస్తున్నారు. రైతులకు పంపిణీ చేసేందుకు పప్పుశనగను ఇప్పటికే రొద్దం, రామగిరి, పెనుకొండ, పరిగి మండలాలకు సరఫరా చేశారు. మరిన్ని విత్తన కాయల కోసం అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపారు.

నీటికి కొదవ లేదు..

ఇటీవల కురిసిన వర్షాలకు జిల్లాలో చెరువులు, నదులు, కుంటలు జలకళ సంతరించుకున్నాయి. దీంతో భూగర్భ జలాలకు కొదవ లేకుండా పోయింది. జిల్లాలో మొత్తం 1,186 చెరువులు ఉన్నాయి. 3 చెరువులు నిండుగా ఉండగా, 10 చెరువుల్లో 75 శాతం నీరు, 120 చెరువుల్లో 50 శాతం, 345 చెరువుల్లో 25 శాతం నీరు నిల్వ ఉన్నట్లు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. జిల్లాలో భూగర్భ జల మట్టం 10.47 మీటర్లుగా ఉన్నట్లు లెక్కగట్టారు. ఈ క్రమంలో ఎక్కడ బోర్లు వేసినా సమృద్ధిగా నీళ్లు పడుతుండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇక.. 15 రోజుల నుంచి జిల్లాలో హంద్రీ–నీవా కాలువ ద్వారా నీరు పారుతుండడంతో రబీ సీజన్‌లో సాగుకు ఇబ్బంది ఉండదని అధికారులు పేర్కొంటున్నారు.



ఇటీవల కురిసిన వర్షాలకు నిండిన వెంగళమ్మ చెరువు



గోరంట్ల మండలం గంగంపల్లి వద్ద సాగు చేసిన ఆలుగడ్డ పంట

భూగర్భ జలం పుష్కలం



రబీ సీజన్‌లో రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు అందించడానికి సిద్ధంగా ఉన్నాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే విత్తన వేరుశనగ పంపిణీ చేస్తాం. ప్రస్తుతం నాలుగు మండలాలకు సరిపడా పప్పుశనగ అందజేశాం. ఇటీవల కురిసిన వర్షాలతో భూగర్భ జల మట్టం తగ్గలేదు.

– సుబ్బారావు, జిల్లా వ్యవసాయాధికారి

క్లుప్తంగా

యువకుడి బలవన్మరణం

పరిగి: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... పరిగి మండలం కొడిగెనహళ్లిలోని శాసనకోట రోడ్డులో నివాసముంటున్న నాగరాజు (35)కు భార్య రాధిక, ఇద్దరు కుమార్తెలు, తల్లి హనుమక్క ఉన్నారు. పరిగిలోని జెడ్పీహెచ్ఎస్‌లో నైట్ వాచ్‌మెన్‌గా తల్లి పనిచేస్తోంది. మగ్గం పనులతో నాగరాజు కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఇటీవల రాధిక మూడో కాన్పులో మరో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. దీంతో మగ్గం పనులతో ముగ్గురు కుమార్తెలను ఎలా పెంచి పోషించాలోనంటూ మదనపడుతుండేవాడు. ఈ క్రమంలోనే శనివారం రాత్రి బాలింతకు సాయంగా తల్లి ఉంచి, ఆమె విధులకు నాగరాజు హాజరయ్యాడు. అర్ధరాత్రి దాటిన తర్వాత మద్యం మత్తులో ఇంటికి చేరుకున్న ఆయన... నేరుగా గదిలోకి వెళ్లి ఇనుప కొక్కికి తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం ఉదయం ఈ విషయాన్ని గుర్తించిన కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

పాసింగ్ అవుట్ పరేడ్ వాయిదా

అనంతపురం క్రైం: ఈ నెల 16న జరగాల్సిన ప్రొబెషనరీ డీఎస్పీల పాసింగ్ అవుట్ పరేడ్ వాయిదా పడింది. సాంకేతిక కారణాల నేపథ్యంలో పరేడ్‌ను ఈ నె 23కి వాయిదా వేశారు. ఈ మేరకు జిల్లా పోలీసు ఉన్నతాధికారులు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు.

19న బెస్త కులస్తుల వివాహ పరిచయ వేదిక



సమావేశంలో మాట్లాడుతున్న బెస్త సంఘం నాయకులు

పుట్టపర్తి టౌన్: ఈ నెల 19న స్థానిక సాయిరామంలో బెస్త కులస్తుల ఉచిత వివాహ పరిచయ వేదిక నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆదివారం సాయి ఆరామంలో నిర్వహించిన బెస్త సేవా సంఘం సమావేశంలో జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ ప్రకటించారు. తొలిసారిగా ఏర్పాటు చేయనున్న వివాహ పరిచయ వేదికకు రాయలసీమ జిల్లాలోని బెస్త కులస్తులందరినీ ఆహ్వానించినట్లు వివరించారు. పరిచయ వేదికకు వధూవరుల వివరాలు ప్రదర్శించాలనుకునే వారు దరఖాస్తుతో పాటు బయోడేటా, కార్డు సైజు ఫొటోలను అందజేయాలన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నాగార్జున, వర్కింగ్ ప్రెసిడెంట్ జ్యోతిప్రసాద్, వెంకటేష్, నాయకులు దత్తశివ, జైసాయి, నరేష్, రవి, గురుశేఖర్, జ్యోతిబాబు పాల్గొన్నారు.

రంగస్థల కీర్తి.. ఆధ్యాత్మిక స్ఫూర్తి

బాలచంద్రుడిగా, శకునిగా, కర్ణుడిగా ఆయన రంగస్థలంపైకి వచ్చాడంటే ప్రేక్షకులు మైమరచిపోతారు. నటుడిగా, మానవతామూర్తిగా, ఆధ్యాత్మిక సేవా తత్పరునిగా, ప్రతి ఇంటా శ్రీవారి కల్యాణోత్సవాలను ఉచితంగా నిర్వహిస్తూ అందరికీ ఆదర్శప్రాయంగా నిలుస్తున్నారు. మనిషి తలచుకుంటే దేన్నైయినా సులువుగా సాధించవచ్చని చాటుతున్న ఆయనే మణూరు నాగరాజు. తన విలక్షణ జీవన ప్రస్థానంపై ఆయన మాటల్లోనే...



నాటికలో నాగరాజు



శ్రీవారి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న నాగరాజు కుటుంబ సభ్యులు

- విలక్షణ జీవనం 'మణూరు' సొంతం
- రంగస్థల నటుడిగా రాణింపు
- ఉచితంగా శ్రీవారి కల్యాణోత్సవాలు నిర్వహిస్తూ ఆదర్శం
- ఆధ్యాత్మిక స్థలాలకు పాదయాత్రలతో యువతకు సందేశం

అనంతపురం కల్చరల్: నేను పుట్టి పెరిగింది అనంతపురంలోనే. బీఎస్ఎన్ఎల్ సంస్థలో నేనూ, భార్య ఉమాదేవి ఇద్దరం పదవీ విరమణ చేశాం. కళాశాలలో చదువుతున్నప్పటి నుంచే నాటకాలంటే పిచ్చి. వందల సార్లు బాలచంద్రుడు, శకుని ఏకపాత్రాభినయం చేశా. అవార్డులు,రివార్డులు అందుకున్నా. మేం వేసిన రాఘవేంద్ర విజయం నాటకం మంత్రాలయ పీఠాధిపతులను మెప్పించింది. నా కుమారులు ఫణికుమార్, యశ్వంత్, భార్య కూడా రంగస్థలంపై మక్కువతో నటరాజు సేవలో తరించినవాళ్లే.

మొరార్జీదేశాయ్‌కు అనువాదకుడిగా..

మా నాన్న మణూరు రామచంద్రరావు స్వాతంత్ర్య సమరయోధుడు. స్వాతంత్ర్యం కోసం జైలుకు వెళ్లి వచ్చాడు. జనతా పార్టీ రాష్ట్ర సెక్రటరీగా ఉండేవారు. అప్పటి ప్రధాన మంత్రి మురార్జీ దేశాయ్, కేంద్రమంత్రులు మధుదండావతే, బాబూ జగ్జీవన్ రామ్ వంటి ఉద్దండులకు ఆయన అనువాదకుడిగా ఉన్నాడు. నిత్యం రాజకీయాల్లో మునిగితేలారు. అయితే, ఆయన వారసత్వాన్ని ఎందుకనో వద్దనుకుని ఉద్యోగిగా, నటుడిగానే స్థిరపడిపోయా.

యువతలో స్ఫూర్తినింపేందుకే..

మనిషి అనుకుంటే ఏమైనా సాధించగలరు. ఆధ్యాత్మిక మార్గంలోనైతే మరింత సాధ్యమవుతుంది. అయితే, నేను చాలా మందిని గమనించా. మనం ఇది చేయగలమా అనే సంశయంలో ఉంటున్నట్లు గుర్తించా. అలాంటి వారిలో స్ఫూర్తినింపేందుకు 66 ఏళ్ల వయసులోనూ ఆధ్యాత్మిక పాదయాత్రలు చేస్తున్నా. ఇప్పటివరకూ 7 సార్లు తిరుమలకు అనంత నుంచి నడుచుకుంటూ వెళ్లొచ్చా. 18 సార్లు శబరిమల పెద్ద పాదం, చిన్నపాదం నడిచా. ఇంత వయసులోనూ అరుణాచలంలో దాదాపు 14 కి.మీ ఉండే గిరి ప్రదక్షిణను రోజుకు రెండు సార్లు 21 రోజులు చేశా. దీన్ని బట్టి నేను చెప్పేదిమేమింటే, ఏదీ అసాధ్యం కాదన్నదే.

అందుకే శ్రీవారి కల్యాణోత్సవాలు..

ఎక్కువ వ్యయంతో కూడుకున్నది కాబట్టి చాలా మందికి శ్రీవారి కల్యాణోత్సవం ఇంటి వద్ద జరిపించుకోవడం కలగా ఉంటుంది. వాటిని పూర్తిగా ఉచితంగా అందించాలన్న ఆశయంతో తిరుమల నుంచి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుని విగ్రహాలు తెప్పించి ప్రతి ఇంటిలో కల్యాణోత్సవాలను ఉచితంగా జరిపిస్తున్నా. ఇప్పటికి 480 దాటిపోయాయి. ఎవరి ఇంటికి పిలిపించినా సేవాభావంతో చేయిస్తా. కరోనా రోజుల్లోనూ ఒక్క రోజు కూడా ఇంట్లో ఉండకుండా నిత్యసేవలందించాం. లోక కల్యాణం కోసం సేవలు సాగాలన్న గురువుల మాట కోసం సేవారంగంలో ఉన్నాం.

మిద్దెపై నుంచి పడి వ్యక్తి మృతి

పుట్టపర్తి టౌన్: పాత మిద్దెను కూలుస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... బుక్కపట్నం మండలం జానకంపల్లికి చెందిన మల్లెల వెంకటేష్ (57)కు భార్య, ఓ కుమారుడు ఉన్నారు. కూలి పనులతో జీవనం సాగించే వెంకటేష్... ఆదివారం అదే గ్రామానికి చెందిన పెద్దన్న పాత మిద్దెను కూల్చే పనికి వెళ్లాడు. మిద్దెపై పనిలో నిమగ్నమైన ఆయన ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడడంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ నరసింహుడు తెలిపారు.

కాలువలో పడి వృద్ధుడు...

ధర్మవరం రూరల్: మండలంలోని పోతుల నాగేపల్లికి చెందిన ఆదెప్ప (72) కాలువలో మృతదేహమై కనిపించాడు. రెండు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయిన ఆయన తిరిగి రాలేదు. బహిర్భూమికి వెళ్లి కాలువలో పడి మృతి చెంది ఉంటాడనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు, పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. కాగా, మృతుడికి ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు.

హత్య కేసులో నలుగురి అరెస్ట్



నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

ముదిగుబ్బ: మండలంలోని సిరిగారిపల్లిలో ఇటీవల చోటు చేసుకున్న హత్య కేసుకు సంబంధించి నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను ఆదివారం పట్నం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ యతీంద్ర, ఎస్ఐ ఇషాక్‌బాషా వెల్లడించారు. సిరిగారిపల్లికి చెందిన మీసాల నాగచెన్నుడు, కోన బాలచన్నయ్య (55) అన్న కొడుకు రామచంద్రుడు మధ్య పాత కక్షలున్నాయి. దీంతో తరచూ వీరిద్దరూ గొడవ పడేవారు. ఈ క్రమంలో ఈ నెల 9న బాల చన్నయ్య నడుచుకుంటూ వెళుతుండగా గమనించిన నాగచెన్నుడు.. ఆయనను చంపాలనే ఉద్దేశంతో మిద్దెపై నుంచి నల్లబండరాయిని వేశాడు. రాయి నేరుగా బాల చన్నయ్య తలపై పడడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, విచారణ అనంతరం పక్కా ఆధారాలతో ఆదివారం మలకవేముల క్రాస్‌లో తచ్చాడుతున్న మీసాల నాగ చెన్నుడు, జీలకర్ర వేణు, మీసాల భాగ్యలక్ష్మి, కోన వెంకట సుబ్బయ్యను అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

ప్రభుత్వాన్ని మెప్పించి సమస్యలు పరిష్కరించుకుందాం

- ఏపీజేఏసీ అమరావతి జిల్లా ఛైర్మన్ దివాకర్‌రావు



మాట్లాడుతున్న దివాకర్‌రావు

అనంతపురం అర్బన్: విధుల నిర్వహణలో ప్రభుత్వాన్ని మెప్పించి... సమస్యలు పరిష్కరించుకుందామని అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఏపీజేఏసీ అమరావతి జిల్లా ఛైర్మన్ ఆర్ఎస్ దివాకర్‌రావు, ప్రధాన కార్యదర్శి పీఎస్ ఖాన్ పిలుపునిచ్చారు. అనంతపురంలోని కృష్ణకళామందిర్‌లో ఉన్న రెవెన్యూ భవన్‌లో ఉమ్మడి అనంతపురం జిల్లా స్థాయి అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ మహాజన సభ ఆదివారం అట్టహాసంగా జరిగింది. ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్లం సురేష్ బాబు అధ్యక్షతన జరిగిన సభకు దివాకర్‌రావు, ఖాన్ ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వాని మెప్పించడం ద్వారా సమస్యల పరిష్కారం చాలా సులువవుతుందన్నారు. ఇందుకు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు సంఘటిత కావాలన్నారు. వివిధ శాఖల్లో తక్కువ వేతనంతో కొన్నేళ్లగా పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు అభద్రతాభావంతో ఉన్నారన్నారు. వీరందరికీ ఉద్యోగ భద్రత కల్పించి జీవితాల్లో వెలుగులు నింపాలని ప్రభుత్వాన్ని కోరారు. చిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి ఏపీజేఏసీ అమరావతి ఎప్పుడూ ముందుంటుందన్నారు. అల్లం సురేశ్ బాబు మాట్లాడుతూ... సమాన పనికి సమానం వేతనం ఇచ్చి అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. పెరిగిన నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా వేతనాలు ఇవ్వాలన్నారు. తక్కువ వేతనంతో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వ పథకాలను పునరుద్ధరించాలన్నారు.

నూతన కమిటీల ఎన్నిక

సభలో అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు సంబంధించి ఏపీ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల నూతన జేసీ జిల్లా కమిటీలను ఎన్నుకున్నారు. అనంతపురం జిల్లా కమిటీ ఛైర్మన్‌గా పి.రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా ఎన్.రాఘువేంద్రరావు, కోశాధికారిగా బి.పుల్లయ్యతో పాటు 17 మంది సభ్యులు, శ్రీసత్యసాయి జిల్లా కమిటీ ఛైర్మన్‌గా ఎస్.గంగాద్రి, ప్రధాన కార్యదర్శిగా ఎం.రమేష్‌నాయక్, కోశాధికారిగా ఈసీ ప్రశాంత్‌కుమార్‌తో పాటు 17 మంది సభ్యులు ఎన్నికయ్యారు.

18వ శతాబ్దం నాటి తామ్ర శాసనం లభ్యం



లభించిన తామ్ర శాసనం

పావగడ: పాలేగాళ్ల కాలానికి చెందిన అప్రకటిత తామ్ర శాసనం లభ్యమైంది. పావగడ తాలూకా వైఎన్ హొసకోట హోబళికి చెందిన దళవాయిహళ్లి గ్రామంలోని ఉపాధ్యాయుడు అశోక్ ఇంట్లో ఈ తామ్ర శాసనాన్ని గుర్తించినట్లు స్థానిక చరిత్ర పరిశోధకుడు హోమా నాగరాజు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... 18వ శతాబ్దానికి చెందిన ఈ తామ్ర శాసనాన్ని కన్నడ భాషతో కూడిన తెలుగు లిపితో రాశారన్నారు. అనంతపురం జిల్లా కుందుర్పి మండలానికి చెందిన అవధాని నరసింహయ్య సహకారంతో శాసనాన్ని పరిశీలించగా.. 33 పంక్తులతో కూడిన ఈ శాసనం శాలివాహన శకం 1699 సంవత్సరంలో యల్లప్ప నాయక వంశానికి చెందిన రామప్ప నాయక రాయించినట్లుగా తెలుస్తోందన్నారు. కన్నయ్య వంశానికి చెందిన శివమాగలు గోత్రం సిద్ధరామనాయక కుమారుడు రంగప్ప నాయకునికి విశిష్ట హక్కులు దానంగా ఇచ్చినట్లుగా శాసనంలో పేర్కొన్నట్లుగా ఉందన్నారు.

జిల్లా మహిళా ఫుట్‌బాల్ జట్టు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో అసోసియేషన్ ప్రతినిధులు

హిందూపురం టౌన్: ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రాతినిథ్యం వహించే జిల్లా సీనియర్ ఫుట్‌బాల్ మహిళా జట్టును ఆదివారం ఎంపిక చేశారు. స్థానిక ఎంజీఎం క్రీడా మైదానంలో జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ప్రక్రియకు వివిధ ప్రాంతాలకు చెందిన పలువురు క్రీడాకారులు హాజరయ్యారు. వీరిలో ప్రతిభ కనబరిచిన 20 మందిని జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. ఎంపికైన వారిలో విజయవాణి, సాయి లత, అయేషా, దివ్యశ్రీ, ఇందు, సుశీల, శ్రుతి, లక్ష్మీదేవి, మౌనిక, మేఘన, త్రిష, ముబీనా, విద్యశ్రీ, దీక్షిత, దివ్య, అలంకిత, శిల్ప, సానియా, పూజిత, గీత ఉన్నారు. ఎంపికలను జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు అనిల్‌కుమార్, కోశాధికారి శేఖర్, ఈసీ మెంబర్లు ఆజాద్, వినయ్ కృష్ణ, బైసాని రామ్‌ప్రసాద్, పీడీలు లోక్‌నాథ్, రామాంజి, ప్రకాష్, రాజు, కదిరప్ప, సీనియర్ క్రీడాకారులు మహమ్మద్ పర్యవేక్షించారు.

తాగిన టీకి డబ్బు కట్టమంటే దాడికి తెగబడ్డారు!

అనంతపురం క్రైం: తాగిన టీకి సంబంధించి డబ్బు చెల్లించాలని కోరిన నిర్వాహకుడిపై అల్లరిమూక దాడికి తెగబడింది. అనంతపురంలోని శారదనగర్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. నగరానికి చెందిన రాఘవేంద్ర... శారద నగర్‌లో టీ కేఫ్ నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో రోజూ రోజూ క్రమం తప్పకుండా కొందరు యువకులు కేఫ్‌లో తిష్టవేసి టీ తాగి డబ్బు తర్వాత ఇస్తామంటూ వెళ్లిపోయేవారు. ఈ క్రమంలో వారు దాదాపు రూ.5 వేలకు పైగా బకాయి పడ్డారు. ఆదివారం కేఫ్‌కు వచ్చిన యువకులు తొలుత టీ తాగారు. అనంతరం వెళ్లబోతుండగా ఇప్పటికే తనకు అప్పులు ఎక్కువగా ఉన్నాయని, బకాయిపడ్డ రూ.5 వేలు ఇస్తే ఎంతో వెసులుబాటుగా ఉంటుందని రాఘవేంద్ర అడిగాడు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ తమనే డబ్బు అడుగుతావా? అంటూ ఆ యువకులు ఇనుపరాడ్‌తో రాఘవేంద్రపై విచక్షణారహితంగా దాడికి తెగబడ్డారు. తీవ్ర రక్తగాయాలతో కిందపడి కొట్టుమిట్టాడుతున్న రాఘవేంద్రను వదిలేసి అక్కడి నుంచి వెళ్లిపోయారు. స్థానికులు వెంటనే అప్రమత్తమై క్షతగాత్రుడిని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. సమాచారం అందుకున్న పోలీసులు టీ కేఫ్‌ను పరిశీలించారు. ఘటనపై స్థానికులతో ఆరా తీశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

అనంతపురం క్రైం: నగరంలోని రంగస్వామి నగర్‌కు చెందిన లోకేష్ (31) ఆత్మహత్య చేసుకున్నాడు. ఉన్నత చదువులు అభ్యసించినా సరైన ఉద్యోగం రాలేదంటూ మదన పడేవాడు. ఈ నేపథ్యంలో జీవితంపై విరక్తి పెంచుకున్న ఆయన ఆదివారం ఉదయం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆలస్యంగా ఈ విషయాన్ని గమనించిన కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు అనంతపురం మూడో పట్టణ సీఐ ధరణీకిషోర్ తెలిపారు.

నేడు టీటీ ఫైనల్స్



టేబుల్ టెన్నిస్ పోటీల్లో తలపడిన క్రీడాకారులు

అనంతపురం: అనంత క్రీడాగ్రామం వేదికగా సాగుతున్న ఏపీ ఇంటర్ డిస్ట్రిక్ట్ అండ్ స్టేట్ చాంపియన్‌షిప్ టేబుల్ టెన్నిస్ పోటీలు తుది దశకు చేరుకున్నారు. పోటీల్లో భాగంగా సోమవారం ఫైనల్ మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. ఆదివారం జరిగిన పోటీలను ఏపీ స్టేట్ టేబుల్ టెన్నిస్ రాష్ట్ర కార్యదర్శి పి.విశ్వనాథ్ పరిశీలించారు. ఉమెన్స్ సెమీ ఫైనల్స్‌లో వై. వైష్ణవి సూర్య (తూర్పుగోదావరి)పై కాజోల్ (ఎన్టీఆర్ జిల్లా) గెలుపొందారు. అలాగే గుణ సంయుక్తపై శైలు (ఎన్టీఆర్‌జిల్లా) గెలుపొందారు. అండర్ 17 విభాగంలో పి. హాసినిపై శ్రీశాన్వి (అనంతపురం), మోహిత గాయత్రి మాచిరాజుపై జి. సిరి పావని (తూర్పుగోదావరి) గెలుపొంది ఫైనల్స్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విశ్వనాథ్ మాట్లాడుతూ... రాష్ట్రస్థాయి టీటీ పోటీలను ఎలాంటి లోటు రానివ్వకుండా నిర్వహిస్తుండడం సంతోషదాయకమన్నారు. ఇందుకు సహకరించిన ఆర్డీటీకి ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలో టీటీ అభివృద్ధికి గత 23 ఏళ్లగా డాక్టర్ అక్బర్ సాహెబ్ చేసిన కృషిని కొనియాడారు. భవిష్యత్తులో జోనల్ మ్యాచ్‌లు కూడా అనంతపురంలో నిర్వహిస్తామని ప్రకటించారు. జిల్లా టీటీ అసోసియేషన్ అధ్యక్షుడు మేజర్ బి. మురళీధర్‌రావు, కార్యదర్శి పి.కేశవ రెడ్డి, ఉపాధ్యక్షుడు ఎం.శ్రీనివాసరెడ్డి, విశ్వనాథ్, జయరాజ్ పాల్గొన్నారు.

విజయ దశమి వేడుకలు ప్రారంభం



కలశపూజ చేస్తున్న వేదపండితులు

ప్రశాంతి నిలయం: ప్రశాంతి నిలయంలో ఆదివారం విజయ దశమి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. భజన మందిరంలో కలశ స్థాపన, కుంకుమ పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేదపండితులు దేవీ అష్టోత్తర నామం, సహస్ర నామార్చన చేశారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె. రత్నాకర్ రాజు పూజల్లో పాల్గొన్నారు. భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

బాలిక మృతికి కారణమైన యువకుడి అరెస్ట్

హిందూపురం అర్బన్: మితిమీరిన వేగంతో ద్విచక్ర వాహనం నడిపి పట్టణానికి చెందిన ఆద్య (8) మృతికి కారణమైన యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇస్లాఫ్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి 15 రోజుల రిమాండ్‌కు ఆదేశించినట్లు సీఐ వి.శ్రీనివాసులు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో పేలిన ఫ్రిడ్జ్



పేలిన రిఫ్రిజిరేటర్ ఇదే

చిలమత్తూరు: మండలంలోని రొద్దంవారిపల్లిలో బయప్ప అనే వ్యక్తి ఇంట్లో శనివారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఫ్రిడ్జ్ పేలి మంటలు చెలరేగాయి. దీంతో ఇంట్లో ఉన్న ధాన్యం, వంట సామగ్రి మంటల్లో కాలిపోయాయి. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఇంట్లో గ్యాస్ సిలిండర్ ఉన్నా ఎలాంటి ప్రమాదం జరగలేదు. సుమారు రూ.లక్ష నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయారు.

మెడికల్ స్టోర్‌లో రూ.10 లక్షలు చోరీ

కదిరి టౌన్: పట్టణంలోని పద్మావతి మెడికల్ స్టోర్‌లో ఉంచిన రూ.10లక్షలను దుండగులు అపహరించుకెళ్లారు. మెడికల్ స్టోర్ నిర్వాహకుడు మురళికి గాండ్లపెంట నివాసి షేక్ రిజ్వాన్ శనివారం రాత్రి రూ.10 లక్షలు ఇచ్చి, భద్రపరచాలని సూచించి వెళ్లాడు. ఈ మొత్తాన్ని మెడికల్ స్టోర్‌లోనే భద్రపరిచి, దుకాణానికి తాళం వేసి మురళి ఇంటికి వెళ్లాడు. దుకాణం బంద్ చేసే సమయంలో స్విచ్‌లన్నీ ఆఫ్ చేయడంతో సీసీ కెమెరాలు కూడా ఆఫ్ మోడ్‌లోకి వెళ్లాయి. ఆదివారం ఉదయం వచ్చి మెడికల్ స్టోర్ తెరిచి చూడడంతో రూ.10 లక్షలు కనిపించలేదు. గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకెళ్లినట్లు గుర్తించిన మురళి ఫిర్యాదు మేరకు సీఐ నారాయణరెడ్డి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.



వెంకటాద్రిపల్లిలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు



కళ్యాణదుర్గంలో పూర్వ విద్యార్థులతో నాటి అధ్యాపకులు

అపూర్వ సమ్మేళనం

బెళుగుప్ప: మండలంలోని వెంకటాద్రిపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో 1980–81 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న వారందరూ దాదాపు 42 సంవత్సరాల తర్వాత ఆదివారం అదే పాఠశాల వేదికగా కలుసుకున్నారు. పూర్వ విద్యార్థి గోపా శ్రీనివాసులు నేతృత్వంలో ఈ కార్యక్రమానికి ప్రస్తుత హెచ్ఎం బాలాజీ అధ్యక్షత వహించారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులు శ్రీరాములు, నంజుండప్ప, అక్కులప్పను ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతుగా రూ.40వేలు విలువ చేసే వివిధ ఉపకరణాలు అందజేశారు. ఇకపై పదో తరగతి పరీక్షల్లో తొలి రెండు స్థానాల్లో ప్రతిభ చాటుకున్న విద్యార్థులకు ఏటా స్కాలర్ షిప్ అందజేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కుళ్లాయి, హనుమప్ప, నాగభూషణం, తులసమ్మ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 1998 - 2001 విద్యాసంవత్సరంలో బ్యాచులర్ ఆఫ్ ఆర్ట్స్ కోర్సు పూర్తి చేసిన వారు పాతికేళ్ల తర్వాత అదే కళాశాల వేదికగా ఆదివారం కలుసుకున్నారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ జయరామరెడ్డి అధ్యక్షత వహించారు. అధ్యాపకులు వెంకటేశులు, చంద్రమౌళి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. స్నేహితులంతా సరదాగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన అధ్యాపకులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శ్రీధర్, తిప్పేస్వామి, రామచంద్ర, చిత్తయ్య, అనిల్, శ్రీనివాసులు, రుద్రానంద, సుజాత, విజయభార్గవి, సక్కుబాయి తదితరులు పాల్గొన్నారు.